సాక్షి
ఖమ్మం
శనివారం : 7 : జనవరి : 2023



పన్నెండేళ్ల తర్వాత పరీక్ష

అర్చకుల ధృవీకరణకు దేవాదాయ శాఖ ఆధ్వర్యాన పన్నెండేళ్ల తర్వాత నిర్వహించిన పరీక్ష తొలిరోజు సాఫీగా ముగిసింది. 8లో



పువ్వాడనగర్‌లో వివాదం

ఇంటి స్థలాల విషయమై పువ్వాడనగర్‌లో రెండు గ్రామాల ప్రజల మధ్య నెలకొన్న వివాదం ఉద్రిక్తతకు దారి తీసింది. 8లో

వాతావరణం

గరిష్టం / కనిష్టం 32° / 13°

శనివారం రోజంతా చల్లని వాతావరణం ఉంటుంది. ఉదయం, సాయంత్రం మంచు తీవ్రత కనిపిస్తుంది.

న్యూస్‌రీల్

సెలవులో కలెక్టర్ గౌతమ్



ఖమ్మం సహకారనగర్: కలెక్టర్ వీ.పీ.గౌతమ్ ఈనెల 17వ తేదీ వరకు వ్యక్తిగత సెలవులో వెళ్తున్నారు. సెలవు కోసం ప్రభుత్వానికి చేసిన దరఖాస్తుకు ఆమోదం లభించింది. దీంతో ఆయన శనివారం నుంచి 17వ తేదీ వరకు సెలవుపై వెళ్తుండగా, 18వ తేదీన తిరిగి విధుల్లో చేరతారు. అయితే, ఇప్పటి వరకు కలెక్టర్ బాధ్యతలు ఎవరికీ అప్పగించలేదు. అదనపు కలెక్టర్ స్నేహలతకు కలెక్టర్‌గా ఇన్‌చార్జ్ బాధ్యతలు ఇవ్వనున్నట్లు తెలుస్తోంది.

18 వరకు బడి బయట పిల్లల సర్వే



ఖమ్మంలో సర్వే నిర్వహిస్తున్న ఉద్యోగులు

ఖమ్మం సహకారనగర్: బడి బయట పిల్లలను గుర్తించేందుకు చేపట్టిన సర్వే ఈనెల 18వ తేదీ వరకు కొనసాగుతుందని డీఈఓ సోమశేఖర శర్మ తెలిపారు. పాఠశాల విద్యాశాఖ, సమగ్ర శిక్ష ఆధ్వర్యాన జరిగే సర్వేను స్కూల్ కాంప్లెక్స్ హెచ్‌ఎం, ఎంఈఓలు, సమగ్ర శిక్ష సెక్టోరియల్ అధికారులు పర్యవేక్షిస్తారని పేర్కొన్నారు. బడి బయట పిల్లలను గుర్తించేందుకు చేపట్టిన సర్వేలో క్లస్టర్ రిసోర్స్‌పర్సన్లు, ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులు, తల్లిదండ్రులు, ఎస్‌ఎంసీ కమిటీలు, ప్రజాప్రతినిధుల సహకారం తీసుకోవాలని సూచించారు. పిల్లలను గుర్తించాక బడిలో చేర్పించేలా చర్యలు తీసుకోవాలని డీఈఓ తెలిపారు.

నేటి నుంచి రాష్ట్రస్థాయి నెట్‌బాల్ టోర్నీ

ఖమ్మంస్పోర్ట్స్: ఖమ్మంలోని సర్దార్ పటేల్ స్టేడియంలో రెండు రోజుల పాటు నిర్వహించే రాష్ట్రస్థాయి సీనియర్ నెట్‌బాల్ చాంపియన్‌షిప్ పోటీలకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. నెట్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యాన శని, ఆదివారాల్లో నిర్వహించే ఈ పోటీలకు రాష్ట్రంలోని పాత పది జిల్లాలకు చెందిన పురుషులు, మహిళల జట్లు హాజరవుతాయి. కాగా, నాకౌట్ పద్ధతిలో పోటీలు జరుగుతాయని నిర్వాహకులు ఎస్.ఫణికుమార్, దీప్తి వెల్లడించారు. ఇక్కడ ప్రతిభ చాటే క్రీడాకారులను జాతీయ జట్టుకు ఎంపిక చేస్తామని తెలిపారు.

గ్రామాల అభివృద్ధికి పెద్దపీట

- జెడ్పీ చైర్మన్ కమల్‌రాజ్



వర్క్‌షాప్‌లో మాట్లాడుతున్న కమల్‌రాజ్

ఖమ్మం సహకారనగర్: తెలంగాణలో గ్రామాల అభివృద్ధికి ముఖ్యమంత్రి కేసీఆర్ పెద్దపీట వేశారని జెడ్పీ చైర్మన్ లింగాల కమల్‌రాజ్ తెలిపారు. ఢిల్లీలో కేంద్ర ప్రభుత్వ పంచాయతీ రాజ్ శాఖ ఆధ్వర్యంలో జరుగుతున్న వర్క్‌షాప్‌లో భాగంగా శుక్రవారం ఆయన మాట్లాడారు. పట్టణాల్లో మాదిరిగానే గ్రామాల్లో సైతం చెత్త, పొడిచెత్త వేర్వేరుగా సేకరణ, డంప్ యార్డులకు తరలింపు తదితర కార్యక్రమాలు చేపడుతున్నట్లు చెప్పారు. ఆయా అంశాల్లో ఇప్పటికే అనేక అవార్డులు గెలుచుకుని గ్రామీణాభివృద్ధిలో దేశానికే దిక్సూచిగా తెలంగాణ ఉందని వివరించారు.

డయల్ 100కు 2,287 ఫోన్లు

ఖమ్మంక్రైం: ప్రజల రక్షణ కోసం ఏర్పాటు చేసిన డయల్ 100కు డిసెంబర్‌లో 2,287 మంది ఫోన్ చేశారని పోలీస్ కమిషనర్ విష్ణు ఎస్.వారియర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఇందులో 72 ఎఫ్‌ఐఆర్‌లు నమోదు చేశామని చెప్పారు. ఈమేరకు ప్రమాదాలు 34, అనుమానాస్పద మరణాలు 13, మహిళలపై వేధింపులు ఎనిమిది, దొంగతనాలు నాలుగింటితో పాటు ఇతర కేసులు 13ఉన్నాయని తెలిపారు.

విద్యార్థులకు ఎన్‌సీసీ-ఏ గ్రేడ్ పరీక్ష

ఖమ్మంక్రైం: జిల్లాలోని పాఠశాలల విద్యార్థులకు శుక్రవారం పోలీస్ హెడ్ క్వార్టర్స్‌లోని కృష్ణప్రసాద్ మెమోరియల్ హైస్కూల్‌లో ఎన్‌సీసీ 'ఏ' గ్రేడ్ రాతపరీక్ష నిర్వహించారు. కల్నల్ సమిత్ కోర్కి, సుబేదార్ మేజర్ జితేంద్ర వశిష్ట, సీటీసీ ప్రిన్సిపాల్, అడిషనల్ డీసీపీ(ఏఆర్) సీహెచ్.కుమారస్వామి ఈ పరీక్షలను పర్యవేక్షించారు. కేపీఎం హైస్కూల్ ప్రిన్సిపాల్ వై.శేషగిరిరావుతో పాటు కె.రవితేజ, జి.రమేష్ పాల్గొన్నారు.

పదికి పది.. అదే లక్ష్యం!



- ముఖ్యమంత్రి కేసీఆర్‌కు ఉమ్మడి జిల్లాను కానుకగా ఇవ్వాలి
- ఉమ్మడి జిల్లాకు ఎనిమిదేళ్లలో రూ.50వేల కోట్లు కేటాయించాం
- రాష్ట్ర మంత్రులు ప్రశాంత్‌రెడ్డి, పువ్వాడ అజయ్‌కుమార్
- రూ.68.90 కోట్ల విలువైన రోడ్డు పనులకు శంకుస్థాపన



రహదారి నిర్మాణానికి శంకుస్థాపన చేసిన మంత్రులు ప్రశాంత్‌రెడ్డి, అజయ్‌కుమార్, పక్కన ఎంపీలు నాగేశ్వరరావు, రవిచంద్ర, కలెక్టర్ గౌతమ్, ఎమ్మెల్సీ మధు, ఎమ్మెల్యేలు ఉపేందర్‌రెడ్డి, వెంకటవీరయ్య తదితరులు (ఇన్‌సెట్) సభలో మాట్లాడుతున్న మంత్రి అజయ్‌కుమార్

సాక్షిప్రతినిధి, ఖమ్మం: వచ్చే ఎన్నికల్లో ఉమ్మడి ఖమ్మం జిల్లాలో పదికి పది సీట్లు సాధించి ముఖ్యమంత్రి కేసీఆర్‌కు కానుకగా ఇవ్వాలని రోడ్లు, భవనాల శాఖ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి, రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ పిలుపునిచ్చారు. పాలేరు నియోజకవర్గంలోని కూసుమంచి, నేలకొండపల్లి, ఖమ్మంరూరల్, సత్తుపల్లి నియోజకవర్గంలోని తల్లాడ, కల్లూరు మండలాల్లో రూ.68.90 కోట్ల వ్యయంతో చేపట్టనున్న రోడ్డు నిర్మాణ పనులకు మంత్రులు శుక్రవారం శంకుస్థాపనలు చేశారు. ఈ సందర్భంగా ఖమ్మంరూరల్ మండలం రామన్నపేట, తల్లాడ, కల్లూరు మండలం చెన్నూరుల్లో నిర్వహించిన సభల్లో మంత్రులు ప్రసంగించారు. మంత్రి ప్రశాంత్‌రెడ్డి మాట్లాడుతూ తెలంగాణ ఏర్పడక ముందు ఖమ్మం ఎలా ఉంది.. ఇప్పుడెలా ఉంది... జిల్లాలోని ఇతర ప్రాంతాలు ఎలా అభివృద్ధి జరిగాయో ప్రజలు గమనించాలని కోరారు. పాలేరులో గత ఎమినిదేళ్లుగా ఎంత అభివృద్ధి జరిగిందో ప్రజలు ఆలోచన చేయాలని సూచించారు. కాగా, పాలేరు నియోజకవర్గంలో కందాల ఉపేందర్‌రెడ్డి గెలుపును ఎవరూ ఆపలేరని, ఉపేందర్‌రెడ్డి అంటే సీఎం కేసీఆర్‌కు చాలా ఇష్టమని తెలిపారు. ఇక సండ్ర వెంకటవీరయ్య సీనియర్ ఎమ్మెల్యే అని.. రాష్ట్రంలో రోడ్ల నిర్మాణాలకు రూ.2,500 కోట్లు కేటాయిస్తే అందులో సత్తుపల్లి నియోజకవర్గానికే రూ.55 కోట్లు కేటాయించడం ఆయన కృషి ఫలితమేనని చెప్పారు. ఇలాంటి ఎమ్మెల్యేను నియోజకవర్గ ప్రజలు ఆశీర్వదించాలని మంత్రి ప్రశాంత్‌రెడ్డి కోరారు.

ఉమ్మడి జిల్లా ప్రజలు ఆశీర్వదించాలి

గతంలో ఎన్నడూ లేని విధంగా ఉమ్మడి ఖమ్మం జిల్లాలో అభివృద్ధి జరిగిందని.. ఈ విషయాన్ని ప్రజలు గమనించి బీఆర్‌ఎస్‌కు పదికి పది సీట్లు ఇచ్చి ఆశీర్వదించాలని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పువ్వా డ అజయ్‌కుమార్ అన్నారు. అభివృద్ధే ధ్యేయగా రాష్ట్ర ప్రభుత్వం పనిచేస్తోందని, మిషన్ భగీరథ పథకం కోసం రూ.40వేల కోట్లు, మిషన్ కాకతీయ పథకం కింద చెరువులు బాగు చేసుకునేందుకు రూ.20వేల కోట్లు ఖర్చు పెట్టామని వివరించారు. టీఆర్‌ఎస్ ప్రభుత్వం వచ్చాకే తెలంగాణలో అట్టడుగున ఉన్న ఉమ్మడి ఖమ్మం జిల్లాలో అభివృద్ధి జరిగిందని, జిల్లాకు నిధులు రాబట్టగలిగామని తెలిపారు. పాలేరు నుంచి భద్రాచలం దగ్గర దుమ్ముగూడెం, చర్ల వరకు ఉన్న ప్రజలకు విజ్ఞప్తి చేస్తున్నానని.. ప్రజలంతా కేసీఆర్‌కు కృతజ్ఞత తెలియజేయాల్సిన అవసరం ఉందని చెప్పారు.



సభకు హాజరైన జనం

దేశం చూపు కేసీఆర్ వైపు

దేశం మొత్తం ముఖ్యమంత్రి కేసీఆర్ వైపు చూస్తోందని, తెలంగాణ మోడల్ అభివృద్ధి దేశంలో జరగాలని ప్రజలంతా కోరుకుంటున్నారని రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర అన్నారు. అందుకే దేశ సేవ చేసేందుకు ముఖ్యమంత్రి కేసీఆర్ టీఆర్‌ఎస్‌ను బీఆర్‌ఎస్‌గా మార్చారని చెప్పారు. కాగా, సింగరేణి ప్రైవేట్‌పరం కాకుండా అడ్డుకుంటామని తెలిపారు.

ప్రజల చిరకాల కోరిక తీరింది..

నియోజకవర్గంలో శంకుస్థాపన చేసిన రోడ్లు త్వరగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకొస్తామని పాలేరు ఎమ్మెల్యే కందాల ఉపేందర్‌రెడ్డి తెలిపారు. ఈ రోడ్ల శంకుస్థాపనతో ప్రజల చిరకాల కోరిక తీరినట్లయిందని తెలిపారు. ఇంత అభివృద్ధి చేస్తున్న ముఖ్యమంత్రి కేసీఆర్‌ను నియోజకవర్గ ప్రజలు దీవించాలని కోరారు. సత్తుపల్లి ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య మాట్లాడుతూ ఉమ్మడి జిల్లాకు వేల కోట్ల రూపాయలు ఖర్చు చేసి ప్రజలకు ఫలాలను అందిస్తున్న ఘనత ముఖ్యమంత్రి కేసీఆర్‌కే దక్కుతుందన్నారు. కాగా, ఖమ్మం 60వ డివిజన్ కార్పొరేటర్ బద్దె నిరంజన్‌కుమార్ రామన్నపేట వద్ద ఏర్పాటు చేసిన సభలో బీఆర్‌ఎస్‌లో చేరగా మంత్రులు ఆయనకు కండువా కప్పి ఆహ్వానించారు. ఈ సభల్లో ఎమ్మెల్సీ, బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు తాతా మధుసూదన్, ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు, డీసీసీబీ, డీసీఎంఎస్, గ్రంథాలయ సంస్థల చైర్మన్లు కూరాకుల నాగభూషణం, రాయల శేషగిరిరావు, కొత్తూరు ఉమామహేశ్వరరావు, మేయర్ పునుకొల్లు నీరజతోపాటు ప్రజాప్రతినిధులు, నాయకులు బెల్లం ఉమ, బీరెల్లి రఘు, దొడ్డా శ్రీనివాసరావు, వరప్రసాద్, కట్టా అజయ్‌కుమార్, దిరిశాల ప్రమీల, బెల్లం వేణు, పగడాల నాగరాజు, కమర్తపు మురళి, ఇంటూరి శేఖర్, లక్కినేని రఘు, పసుమర్తి చందర్‌రావు, పాలెపు రామారావు, జానీ తదితరులు పాల్గొన్నారు.

రూ.50 వేల కోట్లతో ప్రాజెక్టులు

ఉమ్మడి జిల్లాకు ముఖ్యమంత్రి కేసీఆర్ రూ.50 వేల కోట్ల విలువైన ప్రాజెక్టులు ఇచ్చారని బీఆర్ఎస్ లోక్‌సభా పక్ష నేత, ఎంపీ నామ నాగేశ్వరరావు తెలిపారు. ఫలితంగానే ఇక్కడ ఇంత అభివృద్ధి జరిగిందన్నారు. దానవాయిగూడెం–పాపటపల్లి మధ్య ఒకవైపు కెనాల్, మరోవైపు రైల్వే లైన్, ఇవతల గ్రామాలు ఉండగా.. తాను రాజకీయాల్లోకి వచ్చినప్పటి నుంచి ఈ రోడ్డు గురించి చెబుతున్నారన్నారు. ప్రస్తుత ఎమ్మెల్యే పట్టుబట్టడంతో రోడ్డు మంజూరు చేసిన మంత్రి ప్రశాంత్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

ఏసీడీ పేరిట చార్జీల మోత

- ప్రతీ గృహ విద్యుత్ కనెక్షన్‌పై జారీ
- జనవరి బిల్లుతో కలుపుతున్న అధికారులు
- 300 యూనిట్ల కంటే తక్కువ వినియోగించే అందరిపై భారం



బిల్లులో పొందుపర్చిన ఏసీడీ చార్జీ

ఖమ్మంవ్యవసాయం: విద్యుత్ వినియోగదారులపై విద్యుత్ సంస్థ ఏసీడీ(అధునాతన వినియోగ డిమాండ్) పేరిట చార్జీల భారం మోపింది. జనవరి బిల్లును సాధారణ చార్జీలతో పాటు ఏసీడీ బకాయిలతో కలిపి జారీ చేస్తున్నారు. సాధారణంగా కొత్తగా విద్యుత్ కనెక్షన్ తీసుకున్నప్పుడు లోడ్, సర్వీస్ కనెక్షన్, మీటర్ సెక్యూరిటీ చార్జీలు వంటివి వసూలు చేస్తారు. ఈ మొత్తంలో రిఫండబుల్, నాన్ రిఫండబుల్ ఉంటాయి. ఎవరైనా సర్వీసు రద్దు చేసుకున్న సమయాన రిఫండబుల్ డిపాజిట్లు తిరిగి ఇచ్చేస్తారు. ఒకవేళ వినియోగదారుడు బిల్లు చెల్లించని పక్షంలో ఈ డిపాజిట్‌ను జమ చేసుకుంటారు. అన్ని కేటగిరీలకు ఇదే విధానాన్ని వర్తింపచేస్తుండగా, మునుపెన్నడూ లేని విధంగా నూతనంగా తక్కువ విద్యుత్ వినియోగించే గృహ వినియోగదారులపై మరోసారి ఏసీడీ చార్జీలు విధించారు. జిల్లాలో మొత్తం 6.10 లక్షల విద్యుత్ సర్వీసులు ఉండగా, ఇందులో గృహ వినియోగ సర్వీసులు 5.05 లక్షలు ఉన్నట్లు అంచనా.

ప్రతీ గృహ కనెక్షన్‌పై...

పలు రకాల కేటగిరీలపై మాత్రమే విధించే ఏసీడీ చార్జీలను ప్రస్తుతం తక్కువ విద్యుత్ వినియోగించే గృహ వినియోగదారులపై కూడా విధించారు. సాధారణంగా నెలకు 300 యూనిట్లకు పైగా వినియోగం ఉంటే ఏసీడీ చార్జీ విధిస్తారు. అంతకు తక్కువ వినియోగించే వారికి ఏసీడీ చార్జీలను మధ్యలో విధించిన సందర్భాలు లేవు. అలాంటిది 300 లోపు యూనిట్ల విద్యుత్‌ను వినియోగించే వారిపై కూడా ఏసీడీ చార్జీలను మోపింది. కొద్దిరోజులుగా జారీ చేస్తున్న జనవరి బిల్లులో ఏసీడీ బకాయి పేరిట అదనంగా చార్జీ ఉంటుండడంతో ప్రజలు బెంబేలెత్తిపోతున్నారు.

రెండు నెలల సగటు ఆధారంగా..

రెండు నెలల బిల్లును సగటుగా తీసుకొని ఏసీడీ చార్జీలు నిర్ణయించి బిల్లులో అదనంగా విధించారు. నెలకు రూ.500 నుంచి రూ.600 వరకు బిల్లు వచ్చే వినియోగదారులకు ఏసీడీ చార్జీ రూ.1,000కు పైగా జారీ చేశారు. అంటే నెలకు రూ.600 వరకు బిల్లు వచ్చే వినియోగాదారులు ఏసీడీ చార్జీ సుమారు రూ.వెయ్యి కలిపి ఈనెలలో రూ.1,600 వరకు చెల్లించాల్సి ఉంటుంది. కాగా, ఏసీడీ చార్జీలపై వినియోగదారుల నుంచి విమర్శలు వస్తున్నాయి. కనెక్షన్ తీసుకున్న సమయాన డిపాజిట్ వసూలు చేసే విద్యుత్ శాఖ మరోసారి ఏసీడీ చార్జీ జారీ చేయడం సరికాదని చెబుతున్నారు. ఇక అద్దె ఇళ్లలో ఉంటున్న వారు ఈ చార్జీ యజమాని చెల్లించకపోతే పరిస్థితి ఏమిటో తెలియడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

డిపాజిట్లుగా ఏసీడీ చార్జీలు



ఏసీడీ చార్జీలు డిపాజిట్లుగా ఉంటాయి. విద్యుత్ కనెక్షన్‌ను రద్దు చేసుకున్న సమయాన రీఫండ్ చేస్తాం. కనెక్షన్ లోడ్ పెరగడం, భద్రతా చార్జీల కింద వీటిని జారీ చేస్తున్నాం. ఇందులో కొంత రిఫండబుల్, కొంత నాన్ రిఫండబుల్‌గా ఉంటుంది. వినియోగదారులు విద్యుత్ బిల్లులతో పాటు ఏసీడీ చార్జీలను చెల్లించాల్సిందే.

– ఏ.సురేందర్, ఎస్‌ఈ, ఖమ్మం సర్కిల్

అర్హులైన మత్స్యకారులందరికీ సభ్యత్వాలు



సమావేశంలో మాట్లాడుతున్న ఆంజనేయస్వామి

ఖమ్మంవ్యవసాయం: అర్హులైన మత్స్యకారులందరికీ మత్స్య సహకార సంఘాల్లో సభ్యత్వాలు ఇవ్వాలని జిల్లా మత్స్యశాఖ అధికారి ఆంజనేయస్వామి సూచించారు. జిల్లాలోని మత్స్య సహకార సంఘాల అధ్యక్షుల సమావేశం ఖమ్మం సారథినగర్‌లోని మత్స్య కార్యాలయంలో శుక్రవారం జరిగింది. ఈ సమావేశంలో ఆంజనేయస్వామి మాట్లాడుతూ జిల్లాలో నీటి వనరులు పెరుగుతున్న నేపథ్యాన అర్హులైన మత్స్యకారులను సంఘాల్లో సభ్యులుగా అవకాశం కల్పించి వృత్తిని ప్రోత్సహించాలన్నారు. 18 ఏళ్లు నిండిన వారికి సభ్యత్వాలు ఇవ్వొచ్చని తెలిపారు. ఇక ఆరోగ్యానికి మంచి చేసే చేపల వినియోగం పెరిగేలా మత్స్యకారులు కృషి చేయాలని సూచించారు. అనంతరం మత్స్య సహకార సంఘాల నిర్వహణ విధివిధానాలపై సహకార శాఖ అధికారి వెంకటేశ్వర్లు వివరించారు. సంఘాలకు ఎన్నికలు నిర్వహించేందుకు మూడు నెలల ముందు సభ్యుల జాబితా ప్రదర్శించాలని తెలిపారు. వైరా మత్స్య అభివృద్ధి అధికారి బుజ్జిబాబు మాట్లాడుతూ చేపల పెంపకంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఈ కార్యక్రమంలో ఫీల్డ్ అసిస్టెంట్ జీవన్‌తో పాటు సహకార సంఘాల అధ్యక్షులు పాల్గొన్నారు.

చకచకా 'కంటి వెలుగు' ఏర్పాట్లు

జిల్లాకు చేరిన అద్దాలు, సామగ్రి



డీఎంహెచ్‌ఓ కార్యాలయంలో కంటివెలుగు సామగ్రి



సామగ్రిని ప్యాక్ చేస్తున్న సిబ్బంది

ఖమ్మం వైద్యవైద్యవిభాగం : జిల్లాలో ఈనెల 18న కంటి వెలుగు రెండో విడత కార్యక్రమం ప్రారంభం కానుంది. ఈమేరకు రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ జిల్లాకు సామగ్రిని చేరవేసింది. అవగాహన కరపత్రాలు, పరీక్షలకు ఉపయోగించే బోర్డులు, రీడింగ్ గ్లాస్‌లే కాకుండా దగ్గరి చూపు, దూరపు చూపు అద్దాలు కూడా జిల్లాకు చేరుకున్నాయి. రెండో విడత కంటి వెలుగు కార్యక్రమం జిల్లాలో వంద రోజుల పాటు కొనసాగనుండగా, అన్ని గ్రామాలు, వార్డుల్లో ప్రత్యే క శిబిరాలు ఏర్పాటు చేసి ప్రతీ ఒక్కరికి కంటి పరీక్షలు నిర్వహించనున్నారు. అవసరమైన వారికి కంటి అద్దాలు ఇస్తారు. ఇప్పటికే జిలాల్లో 55 బృందాలను ఏర్పాటుచేయడంతో పాటు ఆప్తాల్మిక్ ఆఫీసర్లు, డేటా ఎంట్రీ ఆపరేటర్లను నియమించి శిక్షణ ఇస్తున్నారు. కాగా, జిల్లా చేరిన సామగ్రిని మండలాలకు చేరవేయడంపై అధికారులు దృష్టి సారించారు.

స్వర్ణకవచధారుడైన భద్రాద్రి రామయ్య

భద్రాచలం: భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి వారు శుక్రవారం స్వర్ణ కవచధారులై భక్తులకు దర్శనమిచ్చారు. తెల్లవారుజామున గర్భగుడిలో సుప్రభాత సేవ, సేవాకాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం స్వామివారిని బేడా మండపంలో కొలువుదీర్చి విశ్వక్సేన పూజ, పుణ్యావాచనం నిర్వహించారు. స్వామివారికి కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణ, యోక్త్ర ధారణ గావించి నిత్యకల్యాణ ఘట్టాన్ని అర్చకులు శాస్త్రోక్తంగా జరిపారు. కాగా, శుక్రవారాన్ని పురస్కరించుకుని శ్రీ లక్ష్మీతాయారు అమ్మవారికి అభిషేకం , ప్రత్యేక పూజలు చేశారు.

త్వరలోనే సైన్స్ మ్యూజియం ఏర్పాటు



మ్యూజియం ఏర్పాటుపై చర్చిస్తున్న అసిస్టెంట్ కలెక్టర్ తదితరులు

ఖమ్మంసహకారనగర్: డీపీఈటీ పథకం ద్వారా విద్యార్థుల నైపుణ్యాలు, ఉపాధ్యాయుల సామర్థ్యాలను పెంపొందించేందుకు గాను సైన్స్ మ్యూజియం ఏర్పాటుకు మార్గం సుగమమైందని డీఈఓ సోమశేఖరశర్మ, జిల్లా సైన్స్ అధికారి బి.సైదులు శుక్రవారం తెలిపారు. ఇందుకోసం మూడు విడతలుగా నిధులు విడుదలైనట్లు పేర్కొన్నారు. జిల్లా విద్యాశాఖ కార్యాలయ భవనం మ్యూజియం ఏర్పాటుకు అనువుగా ఉందని గుర్తించి కలెక్టర్‌కు నివేదిక ఇచ్చినట్లు తెలిపారు. నూతన కలెక్టరేట్‌కు విద్యాశాఖ కార్యాలయాన్ని తరలించాక మ్యూజియం ఏర్పాటుపై ఉత్తర్వులు విడుదలవుతాయని వెల్లడించారు. కాగా, అధికారులతో కలిసి అసిస్టెంట్ కలెక్టర్ రాధికాగుప్త శుక్రవారం డీఈఓ కార్యాలయాన్ని పరిశీలించి చర్చించారు.

వృద్ధులకూ ఓ సంఘం!



- త్వరలోనే కొత్త సంఘాల ఏర్పాటు
- 60 ఏళ్లు పైబడిన మహిళలకు చేయూతనిచ్చేలా నిర్ణయం
- బ్యాంకుల్లో పొదుపు ఖాతాలు కూడా..

ఖమ్మంమయూరిసెంటర్: స్వయం సహాయక సంఘాల్లో 60 ఏళ్లు పైబడిన మహిళలను ఇప్పటి వరకు తొలగిస్తున్నారు. ఇక నుంచి వారిని తొలగించకుండా.. వారితో కొత్త సంఘాలు ఏర్పాటు చేయించాలని ప్రభుత్వం నిర్ణయించింది. వృద్ధుల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకున్న ప్రభుత్వం వీరితో ప్రత్యేకంగా సంఘాలు ఏర్పాటు చేయించాలని ఆదేశించగా, జిల్లాలో త్వరలోనే ప్రక్రియ మొదలుకానుంది.

మహిళల బలోపేతానికి..

మహిళలు స్వయం సమృద్ధి సాధించేందుకు గాను స్వయం సహాయక సంఘాలు దోహదపడుతున్నాయి. 1990లో పేద, నిరుపేద మహిళలను గుర్తించి స్వయం సహాయక సంఘాలను ఏర్పాటు చేయాలని అప్పటి ప్రభుత్వం నిర్ణయించింది. అప్పటి నుంచి 10 మందితో కూడిన సంఘాలు ఏర్పాటు చేస్తూ వారితో బ్యాంకుల్లో పొదుపు చేయించారు. ఆతర్వాత బ్యాంకుల ద్వారా రూ.లక్ష నుంచి రూ.12 లక్షల వరకు రుణాలు ఇప్పించి ఆర్థికంగా బలోపేతం అయ్యేందుకు ప్రభుత్వం కృషి చేస్తోంది. ఈ సంఘాల ఏర్పాటుతో మహిళలు ఆర్థికంగా బలోపేతం కావడమే కాక చైతన్యవంతులయ్యారు. కాగా, జిల్లాలో 25,206 స్వయం సహాయక సంఘాలు ఉండగా, ఇందులో 2,56,305 మంది సభ్యులు ఉన్నారు.

60 ఏళ్లు పైబడితే..

స్వయం సహాయక సంఘాల్లో సభ్యులుగా చేరేందుకు 18 ఏళ్లు పైబడిన వారంతా అర్హులు. నాలుగేళ్ల క్రితం వరకు 60 ఏళ్లు పైబడిన మహిళలు కూడా సంఘాల్లో సభ్యులుగా కొనసాగుతూ వస్తున్నారు. అయితే తాజా నిబంధనల కారణంగా సంఘాల నుంచి వీరిని తొలగించాల్సి వస్తోంది. కానీ వృద్ధ మహిళల్లో చాలా మందికి కుటుంబాల నుంచి ఆదరణ, చేయూత లేకపోవడంతో వారు ఆర్థిక అవసరాలకు ఇతరులపై ఆధారపడాల్సి వస్తోంది. దీంతో వీరికి సైతం చేయూతనందించాలని నేషనల్ రూరల్ లైవ్లీహుడ్ మిషన్ నిర్ణయించడంతో 60 ఏళ్లు పైబడిన వారితో కొత్త సంఘాలు ఏర్పాటుకు రంగం సిద్ధమైంది. ఈవిషయమై సెర్ప్ నుంచి డీఆర్‌డీఏ అధికారులకు ఆదేశాలు అందిన నేపథ్యాన కొత్త సంఘాలు ఏర్పాటుకు కార్యాచరణ రూపొందించారు.

పొదుపు మాత్రమే...

కొత్తగా అరవై ఏళ్లు పైబడిన వృద్ధ మహిళలతో సంఘాలు ఏర్పాటుచేయనుండగా, వీరితో బ్యాంకుల్లో పొదుపు ఖాతాలు తెరిపిస్తారు. అలాగే, సభ్యులు ఆర్థికంగా బలోపేతమయ్యేందుకు సామాజిక పెట్టుబడి నిధి అందజేస్తారు. చదువుకున్న సభ్యులకు సీఎల్‌ఆర్‌పీలుగా అవకాశం కల్పించి స్వయం సహాయక సంఘాల బలోపేతం కోసం వినియోగిస్తారు. అరవై ఏళ్లు పైబడిన వారు సంఘాలుగా ఏర్పాటైతే సమస్యలను చర్చించుకోవడానికి వేదిక రావడంతో పాటు సంక్షేమానికి దోహదపడుతుందనే భావనతో ఈ నిర్ణయం తీసుకున్నప్పటికీ బ్యాంకు లింకేజీ తదితర రుణాలు మాత్రం ఇవ్వబోరని చెబుతున్నారు.

కొత్త సంఘాలను ఏర్పాటు చేస్తాం..



అరవై ఏళ్లు పైబడిన మహిళా సభ్యులతో కొత్త సంఘాలు ఏర్పాటు చేయాలని ప్రభుత్వం ఆదేశించింది. దీంతో జిల్లాలో 60 ఏళ్లు పైబడిన మహిళా సభ్యులను గుర్తిస్తున్నాం. త్వరలోనే వారితో కొత్త సంఘాలు ఏర్పాటు చేయిస్తాం. ప్రస్తుతం ఉన్న మహిళా సభ్యుల్లో 20 శాతం మంది 60 ఏళ్లు పైబడిన వారు ఉంటే అవకాశమున్నట్లు అంచనా.

– ఎం.విద్యాచందన, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి

విద్యార్థులు వ్యసనాలకు బానిస కావొద్దు

జిల్లా న్యాయమూర్తి శ్రీనివాసరావు



సదస్సులో మాట్లాడుతున్న జిల్లా జడ్జి శ్రీనివాసరావు

ఖమ్మంలీగల్: విద్యార్థులు లక్ష్యాలను ఎంచుకుని వాటిని సాధించేలా చదువుపై దృష్ట్యి సారించాలని.. అంతేతప్ప వ్యసనాలకు బానిస కావొద్దని జిల్లా ప్రధాన న్యాయమూర్తి డాక్టర్ టి.శ్రీనివాసరావు సూచించారు. జిల్లా న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యాన ఎన్నెస్పీ క్యాంప్‌లోని ఎస్సీ బాలుర వసతి గృహం–బీలో శుక్రవారం న్యాయచైతన్య సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో ఆయన మాట్లాడుతూ సెల్‌ఫోన్లు వాడడం, వాటిని చెడుపనులకు ఉపయోగించడం నేరమని తెలిపారు. సమాజంలో కఠిన పరిస్థితులను ధైర్యంగా ఎదుర్కోవాలే తప్ప ఆత్మహత్యలకు పాల్పడొద్దని హితవు పలికారు. అలాగే, మహిళలను గౌరవించడం ప్రతీ పౌరుడి ప్రాథమిక విధి అని చెప్పారు. ఇక తల్లిదండ్రులు వాహనాలు నడిపేటప్పుడు హెల్మెట్ ధరించేలా పిల్లలు అవగాహన కల్పించాలని తెలిపారు. ఈసమావేశంలో జిల్లా న్యాయసేవాధికార సంస్థ న్యాయమూర్తి మహ్మద్ అబ్దుల్ జావీద్‌పాషా, సాంఘిక సంక్షేమ శాఖ ఉప సంచాలకులు కస్తాల సత్యనారాయణ, జిల్లా కోర్టు సాంకేతికాధికారి ఎస్.ఓంకార్, ఏఎస్‌సీడీఓ శ్రీలత, వసతిగృహ సంక్షేమాధికారులు కె.రుక్మారావు, ఎస్.వెంకట్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

నేడు జిల్లాలో మంత్రి పువ్వాడ పర్యటన

ఖమ్మంమయూరిసెంటర్: రాష్ట్ర రవాణ శాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ శనివారం జిల్లాలో పర్యటించనున్నారు. ఉదయం 10.30 గంటలకు ఎర్రుపాలెంలో కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయాన్ని ప్రారంభిస్తారు. ఆత ర్వాత ఎర్రుపాలెం మండలం బీమవరంలో 33/11 కేవీ విద్యుత్ సబ్ స్టేషన్‌ను ప్రారంభించాక, బనిగండ్లపాడులో ప్రైమరీ హెల్త్ సెంటర్ భవన నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. అనంతరం వైరాలో జరిగే పలు కార్యక్రమాల్లో పాల్గొననున్న మంత్రి పువ్వాడ, మధ్యాహ్నం 3.30 గంటలకు ఖమ్మం వీడీవోస్ కాలనీలోని క్యాంపు కార్యాలయంలో సీఎంఆర్‌ఎఫ్ లబ్ధిదారులకు చెక్కులు పంపిణీ చేస్తారు.

నేడు జిల్లా స్థాయి టాలెంట్ టెస్టు

ఖమ్మం సహకారనగర్: తెలంగాణ సోషల్ స్టడీస్ టీచర్స్ ఫోరం ఆధ్వర్యంలో శనివారం జిల్లా స్థాయి టాలెంట్ టెస్ట్ నిర్వహిస్తున్నట్లు ఫోరం జిల్లా ప్రధాన కార్యదర్శి కె.కృపాబాలానందం తెలిపారు. ఖమ్మంలోని రిక్కాబజార్ పాఠశాలలో ఉదయం 10.30గంటలకు మొదలయ్యే ఈ టెస్ట్‌కు మండల స్థాయిలో ప్రతిభ కనబర్చిన విద్యార్థులు హాజరుకావాలని సూచించారు.

10న చెరకు క్రషింగ్ ముగింపు

కల్లూరు: ప్రస్తుత సీజన్‌కు సంబంధించి చెరకు క్రషింగ్‌ను ఈనెల 10వ తేదీతో ముగించనున్నట్లు కల్లూరులోని కాకతీయ షుగర్స్ ఫ్యాక్టరీ వైస్ ప్రెసిడెంట్ సీహెచ్.నాగేశ్వరరావు తెలిపారు. ఇంకా రైతులెవరైనా చెరకు నరకడం మొదలు పెట్టకపోతే తమ సిబ్బందిని కలిసి పర్మిట్లు తీసుకోవాలని ఆయన ఓ ప్రకటనలో సూచించారు.

విరిగిన రైలు పట్టా..

ఆలస్యంగా నడిచిన పలు రైళ్లు

చింతకాని : చింతకాని రైల్వేస్టేషన్ సమీపాన అప్ లైన్‌లో పట్టా విరిగింది. ఈక్రమంలో శుక్రవారం తనిఖీ చేస్తున్న కీ మేన్ ఈ విషయాన్ని గమనించి రైల్వే అధికారులకు సమాచారం ఇచ్చాడు. దీంతో ఖమ్మం వైపు వచ్చే రైళ్లను ఎర్రుపాలెం, మధిర, బోనకల్ స్టేషన్లలో నిలిపివేశారు. అనంతరం సిబ్బంది చేరుకుని విరిగిన పట్టాకు మరమ్మతు చేపట్టారు. ఈ కారణంగా విజయవాడ నుంచి ఖమ్మం వైపు వచ్చే పలు రైళ్లు ఆలస్యంగా నడిచాయి.

బైక్ అమ్మకం పేరిట మోసం

ఖమ్మంరూరల్: ద్విచక్ర వాహనం అమ్ముతానని నమ్మించి డబ్బులు ట్రాన్స్‌ఫర్ చేయించుకున్న మోసం చేయించుకున్న ఘటన వెలుగుచూసింది. విశాఖపట్నంకు చెందిన డేరంగుల రమేష్ రూ.32వేలకు ద్విచక్ర వాహనం అమ్ముతానని ఆన్‌లైన్‌లో ప్రకటన ఇచ్చాడు. దీంతో ఆయనను మండలంలోని మద్దివారిగూడెంకు చెందిన ఇనుపనూరి ఉపేందర్ సంప్రదించి మూడు విడతలుగా రూ.32వేలు ఆన్‌లైన్‌లో పంపించాడు. కానీ శుక్రవారం వరకు బైక్ రాకపోవడం, ఫోన్ కూడా తీయకపోవడంతో మోసపోయినట్లు గుర్తించిన ఉపేందర్ ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు ఎస్సై వెంకటకృష్ణ తెలిపారు.

గొత్తికోయలకు చేయూత



చిన్నారులకు దుస్తులు, నోట్స్‌బుక్స్ అందజేస్తున్న దృశ్యం

ఏన్కూరు: మండలంలోని కొత్తమేడేపల్లిలో గొత్తికోయల చిన్నారులకు శెట్టిపల్లి నారాయణ, బసవమ్మ మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యాన అండగా నిలిచారు. ఈమేరకు ఎంపీడీఓ బయ్యారపు అశోక్, ట్రస్ట్ నిర్వాహకులు శైలజ శుక్రవారం చిన్నారులకు దుస్తులు, పలకలు, నోట్స్‌బుక్కులు, కుర్చీలు అందచేయడంతో పాటు అన్నదానం ఏర్పాటుచేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ అశోక్ మాట్లాడుతూ సామాజిక సేవ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటున్న మండలంలోని కేసుపల్లికి చెందిన డాక్టర్ శెట్టిపల్లి నాగేశ్వరావు సేవలు అభినందనీయమని కొనియాడారు. గొత్తికోయల ఇబ్బందులను పత్రికల ద్వారా తెలుసుకుని చిన్నారుల చదువుకు ఉపయోగపడే వస్తువులు అందజేయడం అభినందనీయమన్నారు. ట్రస్ట్ సభ్యులు శెట్టిపల్లి రామారావు, కొండపల్లి నాగేశ్వరావు, పిచ్చయ్య, కడియాల కోటేశ్వరావుతో పాటు లక్ష్మానాయక్, ఆవుల నరసయ్య, కొవ్వూరు నాగేశ్వరావు, డి.నాగేశ్వరావు, గంగరాజు, జయరాం, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఖమ్మం మార్కెట్ ధరలు

(క్వింటాకు రూ.లలో)

	గరిష్ట	కనిష్ట
పెసలు	7,000	7,000
మినుములు	6,650	6,650
మిర్చి కొత్తవి	21,000	13,500
నిల్వమిర్చి	21,700	13,000
మిర్చి తాలు	9,300	7,000
పత్తి	8,300	6,000

– ఖమ్మం వ్యవసాయం

పామాయిల్ గెలలు



టన్ను ధర రూ.13,881

పన్నెండేళ్ల తర్వాత పరీక్ష

- అర్చకులకు ఏళ్ల తర్వాత అవకాశం
- ఉత్తీర్ణులైతే దేవాదాయ శాఖలో ఉద్యోగాలకు అర్హత
- ఉమ్మడి జిల్లా నుంచి హాజరైన అభ్యర్థులు
- నేడు కూడా కొనసాగనున్న రాత, మౌఖిక పరీక్షలు



పరీక్ష రాస్తున్న అర్చకులు

ఖమ్మంగాంధీచౌక్: ఆలయాల్లో అర్చకత్వం చేసేందుకు అర్హులైన వారిని గుర్తించేందుకు గాను ప్రభుత్వం అర్చక ఆగమ పరీక్షలు నిర్వహిస్తోంది. అయితే, తెలంగాణ రాక ముందే నాలుగేళ్ల కిందట పరీక్ష జరగగా, ఆ తర్వాత మళ్లీ నిర్వహించలేదు. తెలంగాణలో తొలిసారిగా ప్రస్తుతం అర్చక ఆగమ పరీక్షలు ఏర్పాటుచేశారు. పన్నెండేళ్ల తర్వాత ఈ పరీక్షలు నిర్వహిస్తుండగా, ఉమ్మడి ఖమ్మం జిల్లా పరిధిలో దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు ఖమ్మంలోని ఎస్‌బీఐటీలో కేంద్రం ఏర్పాటుచేశారు. రెండు రోజుల పాటు జరిగే పరీక్షలకు నోడల్ అధికారిగా దేవాదాయ, ధర్మాదాయ సహాయ కమిషనర్ ఎ.సులోచన వ్యవహరిస్తుండగా, దేవాదాయ శాఖ ఉద్యోగులను ఇన్విజిలేటర్లుగా, పరిశీలకులుగా నియమించారు. రెండు జిల్లాల్లో కలిపి రాత పరీక్షకు 227 మంది, మౌఖిక పరీక్షకు 107 మంది అర్చకులు దరఖాస్తు చేసుకోగా, 40 ఏళ్ల లోపు వారికి రాత, మౌఖిక పరీక్షలు, 40 ఏళ్లు పైబడిన వారికి మౌఖిక పరీక్ష నిర్వహిస్తారు. తొలిరోజైన శుక్రవారం పరీక్షలు సజావుగా సాగాయి.

అర్చకులుగా అర్హత కోసం..

అర్చకులుగా అర్హత సాధించేందుకు గాను అర్చక ఆగమ పరీక్షను ప్రభుత్వం నిర్వహిస్తోంది. సంస్కృతంలో ప్రావీణ్యత సాధించి, అర్చకత్వంపై అవగాహన కలిగిన వారు దరఖాస్తు చేసుకుంటే సంస్కృత పరీక్షలో ప్రవేశ, వర, ప్రవర పరీక్షలు నిర్వహిస్తారు. ప్రవేశలో నిత్యారాధన, వరలో ఉత్సవం, ప్రవరలో ప్రతిష్ఠ వంటి అంశాలపై పరీక్ష ఉంటుంది. అలాగే, మౌఖిక పరీక్షలు కూడా నిర్వహించి అర్హత సాధించిన వారికి ప్రభుత్వం ధ్రువపత్రాలు అందజేసి అర్చకులుగా గుర్తిస్తుంది. తద్వారా ప్రభుత్వ, ప్రైవేట్ ఆలయాల్లో ఉపాధి అవకాశాలు లభిస్తాయి. ప్రధానంగా దేవాదాయ, ధర్మాదాయ శాఖలో అర్చకులుగా ఉద్యోగం సాధించాలంటే ఈ పరీక్షలో ఉత్తీర్ణత సాధించడం తప్పనిసరి. అలాగే, ప్రైవేట్ ఆలయాల్లో కూడా సర్టిఫికెట్ ఉన్న వారికి ప్రాధాన్యత ఇస్తారు. దీంతో పన్నెండేళ్ల తర్వాత నిర్వహించిన పరీక్షకు 300 మందికిపైగా దరఖాస్తు చేసుకున్నారు.



ప్రశ్నపత్రాల బండిళ్లు తెరుస్తున్న అధికారులు

తొలిరోజు సాఫీగా..

ఖమ్మం ఎస్‌బీఐటీ కళాశాలలో శుక్రవారం జరిగిన అర్చక ఆగమ రాత పరీక్షలకు 227 మంది దరఖాస్తు చేసుకోగా, ఉదయం 185 మంది, మధ్యాహ్నం 186 మంది హాజరయ్యారు. వారికి ప్రవేశ, వర, ప్రవర పరీక్షలు, నిర్వహించారు. పరీక్షలను దేవాదాయ, ధర్మాదాయ శాఖ వరంగల్ జోన్ డిప్యూటీ కమిషనర్ శ్రీకాంతారావు పర్యవేక్షించారు. కాగా, శనివారం ఉదయం కూడా రాతపరీక్ష, మధ్యాహ్నం మౌఖిక పరీక్ష ఉంటుందని పరీక్షల నోడల్ అధికారి ఎ.సులోచన తెలిపారు.

ఏళ్లుగా ఎదురుచూస్తున్నాం..



అర్చక ఆగమ పరీక్షలు నిర్వహించి పన్నెండేళ్లు అవుతోంది. ఏటా పరీక్షలకు నోటిఫికేషన్ పడుతుందని వేచి చూశాం. ఎట్టకేలకు ఈసారి ప్రభుత్వం పరీక్ష నిర్వహించడం ఆనందంగా ఉంది. ఈ పరీక్షలు రాసి ఉత్తీర్ణత సాధించడం ద్వారా ధ్రువీకరణ పత్రం పొందితే ప్రయోజనకరంగా ఉంటుంది.

– కొడమసింహం భరద్వాజ ఆచార్యులు, ఖమ్మం

పరీక్షతో అర్చకుడిగా గుర్తింపు



అర్చక ఆగమ పరీక్షతో అర్చకుడిగా గుర్తింపు లభిస్తుంది. ఈ అర్హతతో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయి. వృత్తిలో భవిష్యత్ ఉంటుంది. పరీక్ష కోసం కొన్నాళ్లగా సిద్ధమవుతున్నాం. ప్రవేశ, వర, ప్రవర పరీక్షలు రాస్తున్నా. దేవాదాయ శాఖలో ఉద్యోగమే లక్ష్యంగా ఈ పరీక్షకు హాజరయ్యాను.

– వినుకొండ వాసుదేవాచార్యులు, ఖమ్మం

ప్రశాంతంగా పరీక్షలు



ఉమ్మడి జిల్లా నుంచి దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు శుక్రవారం ఉదయం, సాయంత్రం ప్రవేశ, వర, ప్రవర పరీక్షలను నిర్వహించాం. ఉదయం 185 మంది, సాయంత్రం 186మంది పరీక్షకు హాజరయ్యారు. శనివారం రాత, మౌఖిక పరీక్షలు జరగనున్నాయి. పరీక్షల నిర్వహణకు పకడ్బందీ ఏర్పాట్లు చేశాం.

– ఎ.సులోచన, పరీక్షల నోడల్ అధికారి

కేపీఎల్ టోర్నీలో నేపాల్ విజయం



క్రికెటర్లను పరిచయం చేసుకుంటున్న దృశ్యం

ఖమ్మంస్పోర్ట్స్: ఆల్ ఇండియా ఖమ్మం ప్రీమియర్ లీగ్ (కేపీఎల్) టీ–20 క్రికెట్ టోర్నీలో భాగంగా శుక్రవారం జరిగిన మ్యాచ్‌లో నేపాల్ జట్టు ముందంజలో నిలిచింది. సర్దార్ పటేల్ స్టేడియంలో జరిగిన మ్యాచ్‌లో టాస్ గెలిచి బ్యాటింగ్ చేపట్టిన నేపాల్ జట్టు నిర్ణీత 20 ఓవర్లలో ఏడు వికెట్ల నష్టానికి 164 పరుగులు చేసింది. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన ఢిల్లీ జట్టు 122 పరుగులు చేసి ఆలౌట్ కాగా, నేపాల్ జట్టు 42 పరుగుల తేడాతో విజయం సాధించింది. తర్వాత రెండో మ్యాచ్‌లో తెలంగాణ–శ్రీలంక జట్లు తలపడగా టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న తెలంగాణ జట్టు నిర్ణీత ఓవర్లలో ఏడు వికెట్ల నష్టానికి 95 పరుగులు చేసింది. అనంతరం శ్రీలంక కేవలం మూడు వికెట్ల నష్టానికే 97 పరుగులు చేయడంతో విజయం సాధించినట్లయింది. కాగా, మ్యాచ్‌లను అదనపు డీసీపీ సుభాష్ చంద్రబోస్, ఐఎంఏ అధ్యక్షుడు కిషన్, టోర్నీ చైర్మన్ డాక్టర్ కూరపాటి ప్రదీప్‌కుమార్, డాక్టర్ వైవీ ప్రసాద్, జొన్నలగడ్డ శశికుమార్, డాక్టర్ సురేశ్, ఎండీ మతిన్, ఓలేటి సాంబమూర్తి ప్రారంభించారు.

దక్షిణాది యాత్రకు 'వ్యవసాయ' విద్యార్థులు



టూర్ వెళ్తున్న వ్యవసాయ కళాశాల విద్యార్థులు

అశ్వారావుపేటరూరల్: అశ్వారావుపేటలోని వ్యవసాయ కళాశాల 2020 బ్యాచ్‌కు చెందిన 101 మంది విద్యార్థులు శుక్రవారం సౌత్ ఇండియా టూర్‌కు బయలుదేరి వెళ్లారు. మూడు ఆర్టీసీ బస్సుల్లో బయలుదేరిన వారు ఏపీ, తమిళనాడు, కర్ణాటక, కేరళ రాష్ట్రాల్లో పది రోజుల పాటు పర్యటించనున్నారు. ఆయా రాష్ట్రాల్లోని వ్యవసాయ విశ్వవిద్యాలయాలు, ఐకార్ అనుబంధ కళాశాలలు, ఉద్యాన క్షేత్రాలు, వివిధ రకాల పంటలపై అధ్యయనం చేస్తారు. వ్యవసాయరంగంలో అందుబాటులోకి వస్తున్న కొత్త పరిజ్ఞానంపై అవగాహన పొందేలా ఈ టూర్ ఏర్పా టు చేశారు. విద్యార్థుల వెంట కళాశాల ప్రొఫెసర్లు కె.కోటేశ్వరరావు, శిరీష, శ్రీలత, రమేష్ వెళ్లారు.

రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ విజేత వరంగల్

మూడో స్థానంతో సరిపెట్టుకున్న ఖమ్మం

ఖమ్మంస్పోర్ట్స్: రెండు రోజులుగా ఖమ్మంలోని సర్దార్ పటేల్ స్టేడియంలో జరుగుతున్న రాష్ట్రస్థాయి జూనియర్ బాలికల హ్యాండ్‌బాల్ పోటీలు శుక్రవారం ముగిశాయి. ఈ మేరకు ఫైనల్‌లో వరంగల్ – హైదరాబాద్ జట్లు తలపడగా 11–10 గోల్స్ తేడాతో వరంగల్ జట్టు ఘన విజయం సాధించి చాంపియన్‌గా నిలిచింది. హైదరాబాద్ బాలికల జట్టు రెండో స్థానంలో నిలిచింది. అలాగే, మూడో స్థానం కోసం జరిగిన పోటీలో ఖమ్మం–మహబూబ్‌నగర్ జట్లు తలపడగా ఖమ్మం 18 గోల్స్ చేసింది. మహబూబ్‌నగర్ ఏడు గోల్స్ మాత్రమే చేయడంతో ఖమ్మం జట్టు గెలిచి మూడో స్థానంలో నిలిచింది. ఈ సందర్భంగా విజేత జట్టుతో పాటు రన్నరప్ జట్లకు ట్రోఫీలు అందజేశారు. డీవైఎస్ఓ ఎం.పరంధామరెడ్డి, హ్యాండ్‌బాల్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి శ్యామల పవన్‌కుమార్, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు పోట్ల శ్రీకాంత్, డాక్టర్ పాటిబండ్ల రఘునందన్, మిత్ర ఫౌండేషన్ అధినేత కురువెళ్ల ప్రవీణ్‌కుమార్‌తో పాటు రాము, శ్రీనివాస్, కృష్ణయ్య, మోహన్ తదితరులు పాల్గొన్నారు.



మూడోస్థానంలో నిలిచిన ఖమ్మం జట్టు

గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

ఖమ్మంఅర్బన్: నగరంలో బోనకల్ రోడ్డు రామకృష్ణాపురం కెనాల్‌లో శుక్రవారం గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైంది. ఈమేరకు మృతదేహాన్ని ప్రభుత్వ ఆస్పత్రి మార్చురీలో భద్రపరిచారు. మృతుడి ఆచూకీ కోసం ఖమ్మం అర్బన్ పోలీసుస్టేషన్‌లో సంప్రదించాలని సీఐ సూచించారు.

తెలంగాణలో అధికారంలోకి వచ్చేది బీజేపీనే..

ఖమ్మం మామిళ్లగూడెం: తెలంగాణలో ఎప్పుడు ఎన్నికలు జరిగినా అధికారంలోకి వచ్చేది బీజేపీయేనని మాజీ మంత్రి రవీంద్ర నాయక్ ధీమా వ్యక్తం చేశారు. ఖమ్మంలోని జిల్లా పార్టీ కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రజలు బీఆర్‌ఎస్‌కు బీజేపీని ప్రత్యామ్నాయంగా గుర్తించి బ్రహ్మరథం పట్టేందుకు సిద్ధంగా ఉన్నారని తెలిపారు. మాజీ ఎమ్మెల్యే సంకినేని వెంకటేశ్వరావు, కిసాన్‌మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కొండపల్లి శ్రీధర్‌రెడ్డి మాట్లాడుతూ తమ్మినేని కృష్ణయ్య హత్య కేసులో సీపీఎం పార్టీని బీఆర్‌ఎస్‌కు తాకట్టు పెట్టిన విషయాన్ని ప్రజలు గమనిస్తున్నారని అన్నారు. కాగా, శనివారం జరిగే బీజేపీ జాతీయ అధ్యక్షుడు నడ్డా వర్చువల్‌గా మీటింగ్‌కు హాజరుకావాలని కోరారు. ఈసమావేశంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు గల్లా సత్యనారాయణ, మహిళామోర్చా రాష్ట్ర అధ్యక్షురాలు గీతామూర్తితో పాటు ఉప్పల శారద, దేవకి వాసుదేవరావు, విద్యాసాగర్‌రెడ్డి, జితేందర్, శ్రీనివాస్, రుద్ర ప్రదీప్, శ్యాంరాథోడ్, నున్న రవికుమార్, అంజయ్య, మందా సరస్వతి, లక్ష్మీనారాయణగుప్తా, అరుణ, అనిత, వేల్పుల సుధాకర్, గెంటెల విద్యాసాగర్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రవీంద్రనాయక్

కుక్కకు మత్తు మందు.. ఇంటికి గడియ

రూ.2 లక్షలు విలువైన గొర్రెల అపహరణ

వైరా రూరల్: మండలంలోని తాటిపూడిలో గురువారం అర్ధరాత్రి గుర్తు తెలియని వ్యక్తులు జవ్వాజి వెంకటేశ్వర్లుకు చెందిన రూ.2 లక్షలు విలువైన 11 గొర్రెలను ఎత్తుకెళ్లారు. గ్రామంలోని అయ్యప్ప స్వామి ఆలయ నిర్వాహకుడైన వెంకటేశ్వర్లు రాత్రి 12 గంటల తర్వాత నిద్రకు ఉపక్రమించగా, ఆగంతకులు ఫెన్సింగ్ దాటి 11 గొర్రెలు అపహరించారు. ఈ సమయంలో మందకు కాపలాగా ఉన్న కుక్క అవరకుండా మత్తు మందు పెట్టడంతో పాటు వెంకటేశ్వర్లు ఇంటి తలుపులకు గడియ పెట్టారు. అలాగే, ఇంటి ఆవరణలోని ద్విచక్రవాహనం కూడా తీసుకెళ్లారు. శుక్రవారం ఉదయం ఈ విషయాన్ని గుర్తించిన వెంకటేశ్వర్లుకు వైరా పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

ప్రతీ గిరిజనుడికి ప్రభుత్వ పథకాలు

ట్రైకార్ చైర్మన్ రామచంద్రనాయక్

భద్రాచలం: ఐటీడీఏ ద్వారా ప్రతీ ప్రభుత్వ పథకాన్ని గిరిజనుల చెంతకు చేర్చేలా ప్రభుత్వ అధికారులు, సిబ్బంది కృషి చేయాలని రాష్ట్ర ట్రైకార్ చైర్మన్ రామచంద్రనాయక్ సూచించారు. భద్రాచలంలోని ఐటీడీఏ కార్యాలయంలో శుక్రవారం ఆయన ట్రైకార్ జీఎం శంకర్‌రావు, రాష్ట్ర మిషన్ మేనేజర్ లక్ష్మీప్రసాద్‌తో కలిసి పథకాలపై సమీక్షించారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ నిరుపేదలైన గిరిజన రైతుల కోసం గిరివికాసం ద్వారా వందశాతం సబ్సిడీతో 24 గంటలు ఉచిత విద్యుత్ సరఫరా చేయడమే కాక విద్యుత్ కనెక్షన్, బోరు మోటార్ ఇస్తున్నట్లు తెలిపారు. ఈ పథకాన్ని గిరిజనులు వినియోగించుకుని అభివృద్ధి చెందేలా పర్యవేక్షించాల్సిన బాధ్యత అధికారులపై ఉందని చెప్పారు. ప్రభుత్వం అమలుచేస్తున్న సంక్షేమ పథకాలతో గతంతో పోలిస్తే ఇప్పుడు గిరిజన గ్రామాల్లో ఎంతో మార్పు వచ్చిందని పేర్కొన్నారు. కాగా, గిరివికాసం పథకం ద్వారా మంజూరైన బోర్లను గిరిజన రైతులకు ట్రైకార్ చైర్మన్ రామచంద్రనాయక్ ఈ సందర్భంగా అందజేశారు. ఏపీఓ జనరల్ డేవిడ్ రాజ్, ట్రైబల్ వెల్ఫేర్ ఈఈ తానాజీ, జీసీసీ డీఎం విజయ్‌కుమార్, ట్రైబల్ వెల్ఫేర్ డీడీ రమాదేవితో పాటు అధికారులు అశోక్‌కుమార్, భీం, సురేశ్‌బాబు భాస్కరన్, రమణయ్య, నర్సింగరావు, వీరూనాయక్, ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.



గిరిజన రైతులకు బోర్లు అందజేస్తున్న ట్రైకార్ చైర్మన్

అంతా బాగానే ఉందా ?!

- అవసరమైన చోట రోడ్లు, డ్రెయిన్ల నిర్మాణానికి ప్రతిపాదనలు
- 'వాడవాడకు పువ్వాడ' కార్యక్రమంలో మంత్రి అజయ్‌కుమార్



ఇళ్ల పట్టాల విషయమై తహసీల్దార్‌కు సూచనలు చేస్తున్న మంత్రి అజయ్‌కుమార్

ఖమ్మంమయూరిసెంటర్ : 'చెల్లెమ్మా బాగున్నారా.. మున్సిపాలిటీవాళ్లు మంచిగా పనిచేస్తున్నారా.. డ్రెయిన్లు, పారిశుద్ధ్యం ఎలా ఉంది.. నల్లా నీళ్లు వస్తున్నాయా.. మీ కార్పొరేటర్ బాగా పని చేస్తున్నాడా..' అంటూ స్థానికులకు ఆరా తీసిన రాష్ట్ర మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ సమస్యలు తెలుసుకున్నారు. 'వాడవాడకు పువ్వాడ' కార్యక్రమాన్ని శుక్రవారం 50వ డివిజన్‌లో చేపట్టగా ఆర్టీసీ కాలనీ నుంచి మంత్రి పర్యటన ప్రారంభించారు. ఇంటింటికీ వెళ్లి స్థానికులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. కాలనీలోని డ్రెయిన్లు చిన్నగా ఉండి, మురుగునీరు ముందుకు సాగడం లేదని గుర్తించిన మంత్రి.. నూతన డ్రెయిన్ల నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని మున్సిపల్ ఇంజినీర్ కృష్ణలాల్‌ను ఆదేశించారు. అలాగే, రవీంద్రనాథ్ ఠాగూర్ రోడ్డులో విద్యుత్ స్తంభాల సమస్యను స్థానికులు చెప్పడంతో పరిష్కరించాలని సూచించిచారు. ఇక ఇళ్ల పట్టాలు ఇచ్చిన ఆ ప్రాంతంలో స్థలం లేదని లబ్ధిదారులు చెప్పడంతో మాజీ కౌన్సిలర్ శీలంశెట్టి వీరభద్రం తన దృష్టికి తీసుకొచ్చారంటూనే రఘునాథపాలెం మండలంలో లేదంటే మరో చోట స్థలాలు ఇవ్వాలని ఆదేశించారు.

పాలు రావడం లేదా?

అంగన్‌వాడీ కేంద్రాలకు పాలు రావడం లేదా అని మంత్రి పువ్వాడ ఐసీడీఎస్ అధికారులను, అంగన్‌వాడీ టీచర్లను ఆరా తీశారు. నెల నుంచి పాలు రావడం లేదని వారు చెప్పడంతో ఉన్నతాధికారులతో చర్చిస్తానని తెలిపారు. అనంతరం మంత్రి పువ్వాడ మాట్లాడుతూ ముఖ్యమంత్రి కేసీఆర్ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు నగరంలోని ప్రతీ కుటుంబానికి చేరాలనే లక్ష్యంతోనే డివిజన్లలో పర్యటిస్తున్నట్లు తెలిపారు. వాడవాడకు పువ్వాడ కార్యక్రమం ద్వారా గుర్తించిన సమస్యలను తక్షణం పరిష్కరించేందుకు మంత్రి కేటీఆర్ ఎల్‌ఆర్‌ఎస్ నిధుల నుండి రూ.32 లక్షలు విడుదల చేశారన్నారు. ఈ కార్యక్రమంలో మేయర్ పునుకొల్లు నీరజ, కార్పొరేటర్ రాపర్తి శరత్‌కుమార్, సుడా చైర్మన్ బచ్చు విజయ్‌కుమార్, ఏఎంసీ చైర్మన్ లక్ష్మీ ప్రసన్న, మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్ మల్లీశ్వరి, ఎస్ఈ రంజిత్, విద్యుత్ శాఖ డీఈ ఎన్.రామారావు, జిల్లా సంక్షేమాధికారి సంధ్యారాణి, తహసీల్దార్ శైలజ, మాజీ ఎమ్మెల్యే బానోత్ చంద్రావతి తదితరులు పాల్గొన్నారు. కాగా, నగరంలోని బుర్హాన్‌పురం కూరగాయల మార్కెట్ గేట్ వద్ద ఏర్పాటు చేసిన బీఆర్‌ఎస్‌కేవీ జెండాను మంత్రి ఆవిష్కరించారు. మాజీ కార్పొరేటర్ తోట రామారావు, కార్మిక సంఘం నాయకులు బాషా తదితరులు పాల్గొన్నారు.

పువ్వాడనగర్‌లో ఇళ్ల స్థలాల వివాదం

రఘునాథపాలెం: మండలంలోని పువ్వాడ ఉదయ్‌నగర్ గ్రామపంచాయతీలో ఇళ్లస్థలాల విషయమై వివాదం నెలకొంది. గ్రామానికి చెందిన కొందరు స్థలాలు తమవంటే తమవని శుక్రవారం వాదనకు దిగటంతో ఉద్రిక్తత నెలకొంది. పువ్వాడ ఉదయ్‌నగర్ గ్రామ పంచాయతీ కోయచలక సర్వే నంబర్ 192లో గతంలో ప్రభుత్వం పలువురికి ఇళ్ల పట్టాలు ఇవ్వగా, డబుల్ బెడ్‌రూం ఇళ్ల నిర్మాణం కోసం 104మంది నుంచి స్థలాలను తీసుకున్నారు. అయితే, స్థలాలు కోల్పోయిన 94మందికి డబుల్ బెడ్‌రూం సముదాయం పక్కనే స్థలాలు కేటాయించాలని నిర్ణయించినా, పట్టాలు మంజూరు చేయలేదు. ఇంతలోనే ప్రభుత్వ ఆధీనంలో ఉన్న ఆ స్థలంలోకి శివాయిగూడెంకు చెందిన పలువురు తమకు పట్టాలు ఉన్నాయంటూ రాగా, పువ్వాడనగర్‌వాసులు చేరుకుని ఇక్కడి స్థలాన్ని పాఠశాల, పంచాయతీ కార్యాలయం, అంగన్‌వాడీ కేంద్రం ఇతర అవసరాల కోసం ఉపయోగించాలని మంత్రి సూచించారని చెబుతూ వాదనకు దిగడం ఉద్రిక్తతకు దారితీసింది. ఈసమాచారం అందుకున్న తహసీల్దార్ జి.నర్సింహరావు, ఆర్ఐ ప్రసాద్ చేరుకుని ఇరు గ్రామాల ప్రజలకు సర్దిచెప్పారు. ప్రభుత్వ ఆధీనంలో ఉన్న భూమిని ఇంకా కేటాయించలేదని చెప్పడంతో వివాదం సద్దుమణిగింది. ఈ విషయంపై తహసీల్దార్‌ను వివరణ కోరగా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు స్థలాన్ని ప్రభుత్వ అవసరాలకు ఉపయోగిస్తామని తెలిపారు.



తహసీల్దార్‌తో మాట్లాడుతున్న స్థానికులు

మెరుగైన వైద్యం అందించాలి..

ఖమ్మంవైద్యవిభాగం: ప్రజలకు మెరుగైన వైద్యం అందించడం మన్ననలు పొందాలని రాష్ట్ర మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ సూచించారు. నగరంలోని బాబురావు పెట్రోల్‌బంక్ పక్క లైన్‌లో ఏర్పాటు చేసిన శ్రీసాయిరాం ఆర్థోపెడిక్, డెంటల్ అండ్ మల్టీస్పెషాలిటీ ఆస్పత్రిని శుక్రవారం మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా హాస్పటల్ యాజమాన్యాన్ని మంత్రి అభినందించగా, యజమాన్య బాధ్యులు డాక్టర్ వేముల రాజ్‌కుమార్, డాక్టర్ హిమబిందు మాట్లాడుతూ గత ఆరేళ్లుగా ఆర్థోపెడిక్ రంగంలో సేవలందిస్తున్న తాము నూతన భవనంలోకి మార్చామని తెలిపారు. ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య, మేయర్ పునుకొల్లు నీరజ, టీడీపీ నాయకుడు కూరపాటి వెంకటేశ్వర్లు, కార్పొరేటర్ కమర్తపు మురళితో పాటు పాలెపు విజయ్ వెంకటరమణ, డాక్టర్ శ్యామల అమర్‌నాథ్, చంద్రశేఖర్, శ్రీనివాసరావు, తేజావత్ సురేష్ తదితరులు పాల్గొన్నారు.



ఆస్పత్రిని ప్రారంభిస్తున్న మంత్రి పువ్వాడ